

- 'డీఎంఎఫ్‌టీ' నిధులపై ఒత్తిడి పెంచుతున్న ఎమ్మెల్యేలు
- గత ప్రభుత్వ విధానాన్నే అనుసరిస్తున్న కాంగ్రెస్
- అభివృద్ధి పనులు జరగక ప్రభావిత గ్రామాల ఇక్కట్లు
- ఐదేళ్లుగా జిల్లా డీఎంఎఫ్‌టీకీ జమకాని రూ.669 కోట్ల నిధులు



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్ సింగ్

మా నిధులు మాకే

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల ఖనిజ వనరుల ద్వారా ప్రభుత్వానికి జమయ్యే సీనరేజీ పన్నుల నుంచి డీఎంఎఫ్‌టీకి తరలించి ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాల్సిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాన్నే అనుసరిస్తున్నది. మా నిధులు మాకే కావాలంటూ స్థానిక ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. సోమవారం ప్రభుత్వ విప్ జగిత్యాల ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి డీఎంఎఫ్‌టీ నిధులు విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. అంతకుముందు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కూడా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడుస్తున్నా కూడా జిల్లాలో గల వనరుల ద్వారా వసూలవుతున్న డీఎంఎఫ్‌టీకి జమ అవుతున్న నిధులను ప్రభుత్వం జిల్లాకు విడుదల చేయకపోవడం గమనార్హం. వాస్తవానికి ఆయా జిల్లాల్లో డీఎంఎఫ్‌టీకి జమయ్యే నిధులను అక్కడి ప్రభావిత ప్రాంతాల అభివద్ధికి, జిల్లాలో గల ఇతర గ్రామాల అభివృద్ధికి నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. కానీ డీఎం ఎఫ్‌టీకి జమ చేయాల్సిన నిధులను నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకే జమ చేస్తున్నారు. ఈ జిల్లాకు రావాల్సిన నిధులను ఇతర జిల్లాలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా సంస్థలు డీఎంఎఫ్‌టీ నిధులను జిల్లా ఖాతాలో జమ చేయకుండా, నేరుగా ప్రభుత్వ ఖజానాకే చెల్లిస్తున్నారు. కానీ ఆ నిధులు జిల్లాకు బదలాయింపు కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు రాకపోగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ నిధులను విడుదల చేయకపోవడంతో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడింది. గత ఐదేళ్ల నుంచి డీఎంఎఫ్‌టీ రూపేణా జిల్లాకు రావాల్సిన సుమారు 669 కోట్ల రూపాయలు రాకుండా పోయాయి. దీని పర్యావసానంగా జిల్లాలో చేపట్టిన కొన్ని పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలోని గోదావరిఖని, రామగుండం, రామగిరి, కమాన్‌పూర్, మంథని వరకు బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. కొన్ని అండర్ గ్రౌండ్ బొగ్గు గను లు ఉండగా, మరికొన్ని ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. అలాగే పాల కుర్తి మండలంలో సున్నం రాయి గుట్టలు ఉండగా, వాటిని సిమెంట్ తయారీ పరిశ్రమకు లీజుకు ఇచ్చారు. జిల్లాలో గోదావరి, మానేరు నదులు పారుతుండగా ఇసుక రీచులు నడుస్తున్నాయి. ఈ వనరు లను తరలించుకు పోయేందుకు ప్రభుత్వానికి సీనరేజీ సొమ్మును చెల్లిస్తూ ఉంటారు. ఈ సొమ్మును గతంలో స్థానిక సంస్థలకు వాటాల ప్రకారం బదలాయిస్తే, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం వెచ్చించే వాళ్లు. కానీ ఆ పరిస్థితి గత ఐదేళ్ల నుంచి లేకుండా పోయింది.

● 2015లో డీఎంఎఫ్‌టీ ఏర్పాటు

2015లో కేంద్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ మినరల్ ట్రస్టు ఫండ్ (డీఎం ఎఫ్‌టీ)ను తీసుక వచ్చింది. ప్రభుత్వానికి చెల్లించే సీనరేజీ నుంచి 30 శాతం నిధులను డీఎంఎఫ్‌టీకి జమ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా జమ అయిన నిధులను ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం వెచ్చించాల్సి ఉంటుంది. డీఎంఎఫ్‌టీకి 2018 వరకు సుమారు 713 కోట్ల రూపాయలు జమ అయ్యాయి. కేంద్రం తీసుకవచ్చిన జీఓకు అనుబంధంగా ఈ నిధులను ఉమ్మడి జిల్లా అంతటా వెచ్చించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక జీఓను తీసుక వచ్చింది. ఆ మేరకు 2018లో మొదట ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 8106 పనులకు 559 కోట్ల 22 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 1807 పనులు చేపట్టేందుకు 252 కోట్ల 23 లక్షలు మంజూరు చేశారు. అలాగే కోవిడ్ సమయంలో 2020లో రాష్ట్ర ప్రభుత్వం 198 కోట్ల రూపాయలు తీసుకోగా, ఆ తర్వాత కూడా మరొకసారి 123 కోట్ల రూపాయలను మళ్లించడం గమనార్హం. సీఎంఓ నుంచి వచ్చిన ఆదేశాలతో జగిత్యాల జిల్లాకు 23 కోట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు 31 కోట్ల 92 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 18 కోట్ల రూపాయలను జిల్లా అధికారులు కేటాయించారు. మొత్తంగా 13 నియోజకవర్గాల్లో 8266 పనులకు 782 కోట్ల 94 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి.

● జమకాని నిధులు

జిల్లాలో ఖనిజ వనరుల ద్వారా చెల్లించే సీనరేజీ పన్నుల నుంచి 30 శాతం నిధులను జిల్లా డీఎంఎఫ్‌టీకి జమ చేయాల్సి ఉండగా, ప్రభుత్వ ఆదేశాలతో ఐదేళ్లుగా ప్రభుత్వ ఖజానాకే చెల్లిస్తున్నారు. దీంతో జిల్లాలో నేరుగా అభివృద్ధి పనులు చేసుకునే పరిస్థితి లేదు.

(మిగతా 8వ పేజీలో)

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బలగాలు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై జరుపుతున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌తో చేస్తున్న హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో బలగాలను మోహరించి మావోయిస్టు పార్టీని అంతం చేయాలని కేంద్రం ప్రకటించిందని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టులను చంపేదాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం అప్రజాస్వామికమని తెలిపారు. శాంతిచర్చలకు పిలవాలని కోరుతుంటే ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదని, ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లోని ఆదివాసీలను నిర్మూలించే పద్ధతి సరికాదన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 29 ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు ఉచిత నాణ్యమైన విద్యనందిస్తుందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండలంలోని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. మంగళవారం ఊషన్నపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా బెస్ట్ స్కూల్ అవార్డు డీఈఓ చేతుల మీదుగా ఛాంపియన్ స్కూల్ అవార్డు వచ్చిందని ఈసందర్భంగా ఆయన తల్లిదండ్రులకు గుర్తుచేశారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య కోరారు.

వైద్యశాఖ అధికారిణి పై కేసు ఉపసంహరించుకోవాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారిణి అన్న ప్రసన్న కుమారిపై ఓ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం వారు అక్రమంగా పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ సుల్తానాబాద్ మండల శాఖ అధ్యక్షులు ఆవునూరి సతీష్, జిల్లా నాయకులు ఏదుల్ల శంకరయ్య, పట్టణ అధ్యక్షులు ఆషాడపు ముఖేష్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోధావరిఖనిలోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ మిషన్ గురించి ప్రశ్నించిన వైద్యాధికారిపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కేసుపెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. కేసు ఉపసంహరించుకోని పక్షంలో తమ ధర్మసమాజ్ పక్షాన అందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

వేసవి పాఠశాలల్ని విజయవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 29 ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈఓ పర్యవేక్షణలో మే1న ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభం కానున్న వేసవి పాఠశాలల్ని వలంటీర్లు విజయవంతం చేయాలని ఎంఈఓ సిరిమల్ల మహేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసి సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ వలంటీర్లుగా పనిచేసిన వారికి గౌరవ వేతనం ఉంటుందని, జూన్ 10వ తేదీ తర్వాత జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేస్తారని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని వేసవి బడులకు పంపించాలని, విజ్ఞానంతో పాటు వారి మానసిక వికాసానికి ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా రిసోర్స్ పర్సన్ సంది సంపత్‌రెడ్డి, టీం లీడర్ సమీద్, ఓదెల ఎంఈఓ రమేష్, కాంప్లెక్స్ హెచ్ఎంలు నరెడ్ల సునీత, డి.సత్యలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, సాంబయ్య, లక్ష్మినారాయణ, హెచ్ఎం ఈర్ల సమ్మయ్య, సీఆర్పీలు కుర్మ తిరుపతి, ఓంకార్, రాజేందర్, రజిత, ఓదెలు, కాల్వశ్రీరాంపూర్ మండలాల వలంటీర్లు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై వచ్చిన జస్టిస్ సునీతా కుంచాలను మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి

కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు అమలు చేయాలి

● జీఎం కార్యాలయం ఎదుట జేఏసీ ధర్నా

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు, ఇతర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, టీఎస్ఎంసీడబ్ల్యూయు (టీఎస్‌టీయూసీ) రాష్ట్ర నాయకులు కోటగిరి పాపయ్యలు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో వివిధ విభాగాలలో సుమారు 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు అవుట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేనంత పోతున్నారని చట్టబద్ధమైన హక్కులను సౌకర్యాలను అమలు చేయకుండా 8గంటల పనిదినాన్ని అమలు చేయకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం వెంటనే పూనుకోవాలని డిమాండ్ చేశారు. జేబీసీసీఐ నిర్ణయించిన హై పవర్ కమిటీ వేతనాలను 2013నుంచి అమలు చేయాల్సి ఉందన్నారు. మేడే సందర్భంగా సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికులకు వేతనాలను పెంచడంతో పాటు చట్టబద్ధమైన సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సుద్దాల కుమారస్వామి, ఈ నరేష్, కొండ్ర మొగిలి, సంగం రాజు చిటికెల రాయలింగు, గోనె సంతోష్, దెబ్బట సతీష్, ఈదునూరి రామకృష్ణ, ఐ రాజేశం, చింతల శేఖర్, శ్రీనివాస్, విజయ, లక్ష్మి, నాగమ్మ, భూమమ్మ, పద్మ పాల్గొన్నారు.



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

● కాంగ్రెస్ డివిజన్, మండల అధ్యక్షులతో ఎమ్మెల్యే సమీక్ష

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలతో పాటు డబుల్ బెడ్‌రూమ్ అందే విధంగా చూడాలని రామగుండం కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అంతర్గాం, పాలకుర్తి మండలాల అధ్యక్షులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పురోగతి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అనే వివరాలు సేకరించాలని, రాజ్యాంగ పరిరక్షణ అన్నది కేవలం ఒక నినాదం కాదని, ప్రతి భారత పౌరుడి బాధ్యత అని అన్నారు. దేశంలో ప్రస్తుతం బీజేపీ విభజించి పాలించే విధానాన్ని తీసుకువస్తూ దేశాన్ని ముక్కలు చేస్తుందని, సామాన్యుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు, ధనవంతులకు ప్రధాని నరేంద్ర మోదీ మద్దతు ఇస్తూ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చేలా చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

హమాలీ కుటుంబానికి విప్ పరామర్శ

ధర్మారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): లారీ ప్రమాదంలో చనిపోయిన ధర్మారం గ్రామానికి చెందిన మెడవేని రాజేశం కుటుంబాన్ని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం రాత్రి పరామర్శించారు. రాజేశం కుటుంబ పరిస్థితిని గమనించిన అడ్లూరి వెంటనే పెద్దపల్లి కలెక్టర్ కోయశ్రీ హర్షకు ఫోన్ చేసి మాట్లాడారు. జిల్లా సహకార సంఘం ద్వారా 5 లక్షలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా 2 లక్షల రూపాయలు ఇప్పించి అండగా ఉండాలని కోరారు. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించనున్నట్లు అడ్లూరి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చెర్మెన్ అరిగె లింగయ్య, డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, మాజీ విఎస్ఎస్ చైర్మెన్ దేవి జనార్ధన్, కొత్త నర్సింహులు ఉన్నారు.

ట్రినిటిలో వీడ్కోలు హంగామా



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కల్చరల్‌బాష్ ద్వారా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంను ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ప్రారంభంలో కాశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరుల చేతులలో మరణించిన వారికి రెండునిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు యూపీఎస్సీ పరీక్షలలో రాణించాలని అన్నారు. కష్టపడి చదివి రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్రతి పరీక్షల్లో రాణించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తరువాత విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.సీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రాంచందర్, అధాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పహల్గాం దాడులకు నిరసనగా బంద్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడులకు నిరసనగా పెద్దపల్లి ఛాంబర్ ఆఫ్ కామర్స్ మంగళవారం ఇచ్చిన బంద్ పిలుపు పూర్తి స్థాయిలో విజయవంతమైంది. కేవలం పాల కేంద్రాలు, మెడికల్ షాపులు, ఆస్ప త్రులు తప్ప అన్ని వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పహల్గాం ఉగ్రవాదుల కాల్పుల్లో 28 మంది పర్యాటకులను కాల్చి చంపినందుకు నిరసనగా పెద్దపల్లిలో బంద్‌కు పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కమల్ కిషోర్ షారడ, సయ్యద్ మస్రత్ మాట్లాడుతూ దాడులకు నిరసనగా వ్యాపార వర్గాలు లాక్‌డౌన్ మాదిరిగా బంద్ పాటించినట్లు తెలిపారు. సోదరభావంతో శాంతియుతంగా జీవించే భారతదేశంలో తీవ్రవాదానికి స్థానం లేదన్నారు. తీవ్రవాదాన్ని అణిచివేయాలని కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండగా నిలుస్తుందన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బంద్‌లో పాల్గొన్న వ్యాపార వాణిజ్య సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాదూరి వినోద్, పోరండ్ల పరమేశ్వర్, జయప్రకాష్. దేవరకొండ రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, తహేర్‌ఖాన్, అఖిల్ ఖరీం తదితరులున్నారు.

టెర్రరిస్టుల దాడిని నిరసిస్తూ ఓదెల బంద్

ఓదెల: పహల్గాంలో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ హిందూ వాహిణి, బీజేపీ పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఓదెలలో సంపూర్ణ బంద్ పాటించారు.పలువురు నాయకులు మాట్లా డుతూ భారత్‌లో అనుమతి లేకుండా తలదాచకుంటున్న శత్రు దేశాల వాసులను వెంటనే వెనక్కి పంపించాలని, గడువు దాటినా ఇక్కడే ఉంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందు వాహిణి మండల సంయోజక్ శాతాళ్ల కుమార్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తీర్థాల కుమార స్వామి, మేరుగు రంగయ్య, ఎంబాడి కుమార్, రాచర్ల అశోక్, చింతం సత్యనారాయణ, కొక్కుల శ్రీకాంత్ ఉన్నారు.



ఓదెలలో బంద్‌ను పర్యవేక్షిస్తున్న బీజేపీ నాయకులు

అంతర్గాంలో బీజేపీ బంద్ సక్సెస్

గోదావరిఖని: పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడులను నిరసిస్తూ మంగళవారం బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో అంతర్గాం మండల బంద్‌కు పిలుపునివ్వగా వ్యాపార, వాణిజ్య, సంస్థలు బంద్‌కు సహకరించి దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ మాట్లాడారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు నరేంద్ర మోదీ ప్రభుత్వం తగిన బుద్ధి చెబుతుందని అన్నారు. అంతర్గాం బంద్‌కు సహకరించిన వ్యాపారులకు బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడ ప్రభాకర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బాలసాని సత్యంగౌడ్, ఆలకుంట మల్లేష్, ఆకుల హరీష్ పాల్గొన్నారు.

హత్యకేసు నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఏసీపీ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ఓ వ్యక్తిని హత్యచేసిన నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టుచేశారు. ఈ ఘటన వివరాలను ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ గజ్జికృష్ణ వెల్లడించారు. హత్యకు గురైన అపన్నపేటకు చెందిన పోలం కుమార్(38)కు దొంగతుర్తికి చెందిన వరుసకు మరదలు శైలజతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని శైలజ భర్త వేల్పుల సంతోష్ కొంతకాలంగా అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గొడవలు జరిగాయి. సోమవారం వ్యవసాయమార్కెట్‌కు రా మాట్లాడుకుందామని కుమార్‌ను పిలిచాడు. సంతోష్ తన భార్యను తీసుకొని పథకం ప్రకారం జెండాచౌరస్తాలోని ఓ దుకాణంలో కత్తి కొనుగోలు చేసి వ్యవసాయమార్కెట్‌కు చేరుకున్నాడు. పోలం కుమార్ తన కారులో వచ్చాడు. మాటల్లో గొడవకు దిగారు. సంతోష్ వెంట తెచ్చుకున్న కత్తితో కుమార్‌పై దాడి చేశాడు. భార్య శైలజ కదలకుండా పట్టుకుంది. దాడితో కుమార్ అక్కడికక్కడే మృతిచెందినట్లు ఏసీపీ తెలిపారు. ఈ ఘటన పెద్దఎత్తున సంచలనం సృష్టించింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుమార్ భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించి మంగళవారం ఇంట్లో ఉన్న సంతోష్, శైలజను అరెస్టుచేశారు. ఈమేరకు వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి కత్తి, రక్తపు మరకలతో ఉన్న బట్టలు స్వాధీనం చేసుకున్నారు. ఆయనవెంట సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై మల్లేష్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు హమాలీ మృతి


రాజేశం(ఫైల్)

ధర్మారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలకేంద్రానికి చెందిన మెడవేని రాజేశం(57) అనేహమాలి ప్రమాదవశాత్తూ లారీ కిందపడి మృతిచెందినట్లు ధర్మారం ఎస్‌ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు. సోమవారం రాత్రి మేడారం గ్రామంలో లారీలో వడ్లు లోడ్ చేస్తుండగా లారీడ్రైవర్ గుర్రాల మల్లేశం నిర్లక్ష్యంతో లారీని ముందుకు పోనివ్వడంతో లారీపై నుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయలపాలైన రాజేశంను ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. రాజేశం భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నర్సయ్య(ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి నెలరోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూమృతిచెందిన సంఘటన చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కొమ్ము నర్సయ్య(42)అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో నెలరోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించగా, గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మంగళవారం తెలిపారు. మృతుడికి భార్య పద్మ,కూతుర్లు ఉచిత, జయ, కుమారుడు నిరంజన్ ఉన్నారు.

మామిడిచెట్టుపై నుంచి పడి వలస కూలీ మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం గ్రామంలో మామిడితోటలో మామిడి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి సీతారాం సాయక్కర్(57) అనే వలసకూలీ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నవార్గ్రామానికి చెందిన సీతారాం సాయక్కర్ ఉపాధినిమిత్తం జగిత్యాలకు వచ్చాడు. అంతర్గాం గ్రామంలో మంగళవారం మామిడికాయలు తెంపుటకు కూలికి వెళ్లాడు. మామిడి కాయలు తెంపుతున్న క్రమంలో కొమ్మవిరిగి సీతారాం సాయక్కర్ కిందపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి సీతారాం సాయక్కర్ మృతిచెందాడు. మృతుడి బంధువు పరిమళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

తల్లి మృతిని తట్టుకోలేక తనయుడి బలవన్మరణం

గోదావరిఖని, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడీనగర్ ప్రాంతంలోని డాంబర్ ప్లాంట్ షెడ్డులో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తనతల్లి మృతిని తట్టుకోలేక సోమవారం రాత్రి ఉరి వేసుకుని మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన పప్పు కుమార్‌సింగ్(28), మేచినేని అజయ్ అనే రోడ్డు కాంట్రాక్టర్ వద్ద రెండు సంవత్సరాల నుంచి లోడర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. జీడీనగర్ ప్రాంతంలోని డాంబర్‌ప్లాంటు సమీపంలోని ఓ రేకులషెడ్డులో నివాసం ఉంటున్నాడు. మూడు నెలల క్రితం మృతుడి తల్లి అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుంచి తరచుగా తనతల్లిని తలచుకుని బాధపడుతూ మనోవేదన చెందేవాడని, ఈ విషయాన్ని తన తోటి పనివాళ్ల దగ్గర చెప్తూ బాధపడేవాడని తెలిపారు. అదేక్రమంలో తీవ్ర మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని యజమాని అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కథలాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తక్కళ్ళపల్లికి చెందిన భైకని గంగారాం (60) అనే వృద్ధుడు అనారోగ్య కారణాలతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం గంగారాం కొన్నేళ్లుగా ఎనిమియా వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా తీవ్రం కావడంతో మనస్థాపానికి గురై గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణం చెందినట్టు చెప్పారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సేవల విస్తరణకు ప్రత్యేక యాప్

వినియోగదారుల సమస్యలకు పరిష్కారం

అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎన్‌పీడీసీఎల్



గణేశ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 20 రకాల సేవలతో కూడిన ప్రత్యేక యాప్‌ను రూపొందించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, అంతరాయం, బిల్లులు చెల్లింపు, గతంలో చెల్లించిన బిల్లులకు సంబంధించిన సమాచారం, ఇలా ఏ విషయంలో సందేహాలు, సమస్యలున్నా సంస్థ కార్యాలయం గడప తొక్కాల్సిందే. మనం వెళ్లిన సమయంలో సంబంధిత అధికారి లేక పోవచ్చు. ఈ నేపథ్యంలో వినియోగదారుల ఇబ్బందులను తొలగించేందుకు టీజీఎన్పీడీసీఎల్ (TGNPDCL) పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ మెయిల్ ద్వారా లాగిన్ కావాల్సి ఉంటుంది. ఈ యాప్‌లో సమస్య నమోదు చేస్తే అధికారులు పరిష్కారం చూపుతారు.

● కొత్త కనెక్షన్లు

నివాసం గృహంలోని విద్యుత్‌మీటరు, పంట పొలానికి నీరందించే బోరుబావికి కొత్త సర్వీసు ఎలా పొందాలనే విషయాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దరఖాస్తు చేసు కుంటే అది మంజూరైందా ? లేదా ? దరఖాస్తు ఏ స్థాయిలో ఉంది? అనే పూర్తి సమాచారం దరఖాస్తు నంబరు ఆధారంగా తెలుస్తుంది. కొత్త విద్యుత్తు కనెక్షన్ ఎలా తీసు కోవచ్చు.. దరఖాస్తు సమయంలో ఏఏ ధ్రువ పత్రాలు జత చేయాలి? వంటి సమాచారం యాప్లో ఉంది.

● సొంతంగా రీడింగ్..

వినియోగదారులు నెలనెలా తాను వినియోగించిన విద్యుత్‌ను తానే లెక్కించుకునే వెసులుబాటు ఉంది. స్పాట్ బిల్లింగ్ తీసే వ్యక్తి సకాలంలో రాకుంటే వినియోగదారులే నేరుగా బిల్లింగ్ తీసుకునే అవకాశం ఉంది. నెలనెలా కేంద్రాలకు వెళ్లి వరుసలో నిల్చుని బిల్లు చెల్లించే అవసరం లేకుండా ఈ యాప్ లోనే చెల్లించవచ్చు. ఆయా సర్వీసులకు సంబంధించి గతంలో చెల్లించిన బిల్లులకుసంబంధించిన సమాచారం చూసుకోవచ్చు.

● ఫిర్యాదులు

విద్యుత్తు సరఫరాలో లోటుపాట్లు, అంతరాయాలకు సంబంధించిన ప్రతి అంశం పై యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంది. పరిష్కారం ఏ స్థాయిలో ఎక్కడ పెండింగ్‌లో ఉందో చూసుకునే సౌలభ్యం ఉంది. సమస్య సరిష్కారం కాకున్నా.. సంతృప్తికరంగా లేకున్నా తిరిగి ఫిర్యాదు చేసుకోవచ్చు. క్షేత్ర స్థాయిలో సమస్య ఎదురైతే ఫోన్లో ఫొటో తీసి ఫిర్యాదు చేయొచ్చు. ఆ ఫిర్యాదు నేరుగా సంబంధిత అధికారికి చేరుతుంది. సంబంధిత ప్రాంత సమస్య పరిష్కారమవుంది.

● పేరు, లోడ్ మార్పు..

మీటర్ పేరు మార్చుకోవాలన్నా, సర్వీస్ లోడ్ పెంచుకోవాలన్నా కావాల్సిన సమాచారం, చెల్లించాల్సిన నగదు వివరాలు యాప్ అందుబాటులో ఉన్నాయి. మీటరులో లోపాలుంటే మార్చుకునే వెసులుబాటు ఉంది. గృహ కేటగిరీ నుంచి వ్యాపారం, వ్యాపార కేటగిరీ నుంచి గృహ వినియోగానికి మార్చుకునే అవకాశం ఉంటుంది.

● ప్రమాదాల నివారణ..

విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఉపకరణాల వినియోగంలో ఆచరించాల్సిన పొదుపు సూచనలు యాప్‌లో ఉన్నాయి. 24 గంటలు పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఉంటాయి. ఇలా 20 రకాల సేవలను వినియోగించుకునే సదుపాయాన్ని కల్పించారు.

● అధికారుల వివరాలు..

పట్టణ, గ్రామీణ స్థాయి అధికారులను సంప్రదించాలనుకుంటే వారి సెల్ ఫోన్ నంబర్లు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అధికారులను నేరుగా సంప్రదించవచ్చు.

సమయం ఆదా చేసుకోవచ్చు..

మేక రమేష్‌బాబు,

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్తు సేవలను ఉన్నచోటు నుంచే పొందవచ్చు. సమయం ఆదా చేసుకోవచ్చు. యాప్ ద్వారా చేసిన ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. ఈ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక విభాగం పర్యవేక్షిస్తుంది.

ఆర్ఎస్ఐకి దేహశుద్ధి

● మద్యం మత్తులో అర్ధరాత్రి పక్కింటి పైఅంతస్థుకు..

● అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణపరిధి సర్ధాపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న 17వ బెటాలియన్ ఆర్ఎస్ఐ మహేశ్ ఓ ఇంటిపైకి వెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు నిద్రలేచి దొంగ..దొంగ అంటూ కేకలు వేయడంతో ప్రజలు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 17వ బెటాలియన్‌లో పనిచేసే ఆర్ఎస్ఐ మహేశ్ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న ఆర్ఎస్ఐ పక్క ఇంటి పైఅంతస్థుకు వెళ్లడంతో ఎండాకాలం కావడంతో పైన నిద్రిస్తున్న మహిళ లేచి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆర్ఎస్ఐని పట్టుకొని దేహశుద్ధి చేశారు. దొంగతనానికి వచ్చావా అంటూ నిలదీశారు. అప్పటికే సమాచారం అందుకున్న సిరిసిల్ల టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని ఆర్ఎస్ఐ మహేశ్‌గా గుర్తించి అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై 17వ బెటాలియన్ కమాండెంట్‌కు సమాచారం అందడంతో మంగళవారం సర్ధాపూర్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. మద్యం మత్తులో ఉండడం వల్ల ఆర్ఎస్ఐ ఆ ఇంటికి వెళ్లినట్లు, పొరపాటున తన ఇంటికి వెళ్లాల్సింది పక్కింటికి వెళ్లినట్లు ఆర్ఎస్ఐ కమాండెంట్ విచారణలో చెప్పినట్లు తెలిసింది. సదరు ఇంటి కుటుంబసభ్యులు మంగళవారం సాయంత్రం వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని, తాను పొరపాటున ఆ ఇంటికిపైకి వెళ్లానని ఆర్ఎస్ఐ చెప్పినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్న దర్శనం చేసుకున్న భక్తులు రాత్రి ఆలయ వసతిగదుల్లో విడిది చేసి మంగళవారం అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ, క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. గంటలతరబడి క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి పట్నాలు వేసి అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ ఉద్యోగులతో భక్తులు వాగ్వాదం..

వేములవాడ శ్రీబద్దిపోచమ్మ ఆలయ ఉద్యోగులకు, భక్తుల మధ్య మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఓ కుటుంబ అమ్మవారి దర్శనానికి వచ్చారు. సదరు భక్తులు క్యూలైన్‌ల ద్వారా అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉండగా ఎగ్జిట్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. గుర్తించిన ఆలయ ఉద్యోగులు వారిని నిలిపివేయడంతో దురుసుగా ప్రవర్తించారని. దీంతో అక్కడే ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బంది వచ్చి భక్తులను బయటకు పంపిచేందుకు ప్రయత్నించగా, సదరు ఉద్యోగితో సైతం దురుసుగా ప్రవర్తించడంతో ఆలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో ఫిర్యాదుల పర్వం

● తనపై దాడికి దిగారని అధిష్ఠానం వద్దకు పురుమల్ల శ్రీనివాస్

● శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని ఆర్టీఏ సభ్యుడు రాహుల్ డిమాండ్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కాంగ్రెస్‌లో ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. కొంతకాలంగా జిల్లా పార్టీలో చోటు చేసుకుంటున్న గ్రూపురాజకీయాలు సోమవారం డీసీసీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత నిర్మాణం సన్నాహక సమావేశంలో భగ్గుమన్నాయి. రెండువర్గాల మధ్య తీవ్రవాగ్వాదంతో ఒకరినొకరు తోసుకున్నారు. దాదాపు దాడి చేసుకునేంత పనిచేశారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితర నాయకులు సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. ఈ గొడవపై రెండువర్గాలు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కష్టపడిన కార్యకర్తలు, నాయకుల నామినేటెడ్ పోస్టుల కోసం తాను ప్రతిపాదించగా ఒకరు అడ్డుకుంటున్నట్లు వేదికపై కరీంనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించినవేనంటూ ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మరికొందరు నాయకులు వాగ్వాదానికి దిగడంతో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. ఈ మేరకు మంగళవారం ఉదయమే హైదరాబాద్‌కు వెళ్లిన పురుమల్ల శ్రీనివాస్ తనపై రాహుల్‌తోపాటు కొందరు దాడికి దిగారంటూ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు మెయిల్ ద్వారా, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. తాను మూడు నాలుగు నామినేటెడ్ కమిటీలతోపాటు నియోజకవర్గ స్పెషల్ డెవలప్ ఫండ్ నిధులకు ప్రతిపాదనలు పంపిస్తే వాటిని ఒకరిద్దరు అడ్డుకొని వారికి అనుకూలంగా మలచుకుంటున్నారని మాత్రమే మాట్లాడానని, దీనిని కొంతమంది మంత్రిని ఉద్దేశించి మాట్లాడినట్లు తప్పుడుగా అర్థంచేసుకొని తనపై దాడికి వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మరోవైపు సమావేశంలో పార్టీ నాయకులపై తీవ్ర వాఖ్యలు చేసిన పురమల్ల శ్రీనివాస్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం తెంలగాణ ఇన్‌చార్జి, టీపీసీసీ అధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు రాహుల్ తెలిపారు.

నిజామాబాద్ గ్రామశివారులో రోడ్డు ప్రమాదం

● పలువురికి స్వల్పగాయాలు

కోనరావుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్, మామిడిపల్లి గ్రామశివారులో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో స్వల్పగాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు. ఈ రెండు గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న కారు, టాటాఏసీ ఢీకొన్నాయి. టాటా ఏసీలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో మంగళవారం రోడ్డుప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నీరంకశంకర్ తీవ్రగాయాలపాలయ్యాడు. ఎల్లారెడ్డిపేట వైపు నుంచి సిరిసిల్లకు వెళుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాదాన్ని చూసి ఆగారు. 108లో క్షతగాత్రుడిని సిరిసిల్లకు తరలించారు. నీరంక శంకర్ తన ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కొమిరలో ధాన్యం, పశుగ్రాసం దగ్ధం

ఓదెల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండల కేంద్రంలో మంగళవారం బొంగోని రాజయ్య అనే రైతుకు చెందిన పశుగ్రాసం, ధాన్యం విద్యుదాఘాతంతో నిప్పు అంటుకుని దగ్ధమైంది. ఇటీవల తన సీడ్ వరి పంటలోని మగ వరిని కోసి కుప్పగా వేసుకున్నారు. విద్యుత్ తీగలు ఒదులుగా ఉండడంతో గాలివీచిన సందర్భంలో వైర్లు ఒకదానికి మరొకటి తాకి నిప్పురవ్వలు ఎగిసిపడి అగ్ని ప్రమాదం సంభవించింది. పొలంలో కుప్ప పోసి ఉన్న ధాన్యం, మగవరి ధగ్ధం అయింది. ఎనభై వేల రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య


రవీందర్‌రెడ్డి(ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తాటిపల్లికి చెందిన అట్ల రవీందర్‌రెడ్డి(42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రవీందర్‌రెడ్డి కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా నయం కాకపోవడంతో మంగళవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సైతెలిపారు.

విద్యుదాఘాతంతో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి


వికాస్‌రెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇంజనీరింగ్ విద్యార్థిమృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా, పెగడపల్లి మండలం, ల్యాగలమర్రి గ్రామానికిచెందిన వికాస్ రెడ్డి(22)మండలకేంద్రంలోని ఓహాస్టల్‌లో ఉంటూ ఇంజనీరింగ్ బీటెక్(సీఎస్ఈ) 4వసంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం హాస్టల్ యజమాని సంతోష్‌రావు హాస్టల్‌పక్కనేఉన్న చెట్టుకొమ్మలు నరికేందుకు వికాస్‌రెడ్డితోపాటు మరోవిద్యార్థిని పురమాయించాడు. వికాస్‌రెడ్డి చెట్టుఎక్కి కొమ్మలు నరుకుతుండగా చెట్టుకొమ్మ విరిగి కింద ఉన్న 11కేవీ విద్యుత్‌వైర్లపై పడింది చెట్టుకు విద్యుత్‌షాక్ రావడంతో చెట్టుపైఉన్న వికాస్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వికాస్‌రెడ్డిమృతిచెందిన విషయం తెలుసుకున్న ఇంజనీరింగ్ కళాశాలచైర్మన్ జువ్వాడిసాగర్‌రావుప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాగి తీగ చోరీ

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుగుల, చిన్నపాపయ్యపల్లి గ్రామాల్లోని రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల నుంచి రాగితీగ చోరీ అయినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన మొత్తం 12మోటార్ల నుంచి తీగ చోరీ అయిందన్నారు. ఒక్కో మోటార్‌లోని తీగ విలువ రూ.12నుంచి 20 వేల వరకు ఉంటుందని తెలిపారు.



బస్సుల్లో చిల్లర సమస్యకు చెక్

● టిమ్, ఈటిమ్‌లు ప్రవేశపెడుతున్న ఆర్టీసీ ● ఆన్‌లైన్ పేమెంట్ల దిశగా అడుగులు

భగత్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆన్‌లైన్ పేమెంట్ల దిశగా అడుగులు వేస్తున్నది. టిమ్, ఈటిమ్‌లతో చిల్లర సమస్యతో పాటు, అన్ని సమస్యలను అధిగమించే దిశగా ముందుకు సాగుతున్నది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు ఉన్నాయి. అన్నిడిపోల్లో టిమ్‌లతో, పాటు కొత్తగా ఈటిమ్‌లను ప్రవేశ పెడుతున్నారు.

● నగదు రహిత సేవలు

ఆర్టీసీ నగదు రహిత సేవలను ప్రయాణీకులకు అందించేందుకు నూతనంగా ఈటిమ్‌లను ప్రవేశపెడుతున్నది. ఎలక్ట్రానిక్ టికెట్ ఇష్యు మెషీన్లను (ఈ-టిమ్స్) ప్రస్తుతం ఏసీ, సూపర్‌లగ్జరీ, డీలక్స్, స్లీపర్ బస్సులో ప్రవేశ పెట్టింది. వీటితో నగదు రహిత సేవలు అందించేందుకు వీలు ఉంది. ఈ టిమ్‌ల ద్వారా ప్రయాణికులు గూగుల్‌పే, ఫోన్‌పే, కార్డు స్వైపింగ్ తో డబ్బులు చెల్లించి టికెట్ పొందే అవకాశం ఉంటుంది. ఈ టిమ్ వ్యవస్థను దశలవారీగా ఇతర సర్వీసుల్లో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

● ప్రయాణికులకు తప్పనున్న ఇబ్బందులు

ఈ టిమ్‌ల ద్వారా చిల్లర సమస్యకు చెక్ పడనున్నది. కండక్టర్ వద్ద చిల్లర లేని సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గమ్యస్థానంలో దిగేటప్పుడు ఇద్దరు ముగ్గురు ప్రయాణికులకు కలిపి డబ్బులు ఇస్తుండడంతో వారు ఇబ్బందులు పడేవారు.



కొత్తగా వచ్చిన ఈటిమ్, ప్రస్తుతం వాడుతున్న టిమ్

ప్రయోగాత్మకంగా అమలు

:బి రాజు, కరీంనగర్ ఆర్ఎం



ఆర్టీసీ బస్సుల్లో ఈ టిమ్‌లను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాము. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల్లో టిమ్‌లు, ఈటిమ్‌ల ద్వారా సేవలు అందిస్తున్నాము. ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచైనా సర్వీస్ లోడ్ చేసే సదుపాయం ఉండడంతో ఇబ్బందులు తొలగి పోనున్నాయి. నగదు రహిత సేవలు ప్రయాణీకులకు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఎన్నో ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

11 డిపోలు.. 2,069 టిమ్‌లు

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు ఉండగా అన్ని డిపోల్లో 2069 టిమ్‌లను అందుబాటులోకి ఆర్టీసీ రోడ్డు రవాణా సంస్థ తీసుకు వచ్చింది. రీజియన్‌లో డిపోల వారీగా టిమ్‌ల వివరాలు

డిపో	టిమ్‌ల సంఖ్య
గోదావరిఖని	294
హుస్నాబాద్	90
హుజూరాబాద్	149
జగిత్యాల	261
కరీంనగర్-1	261
కరీంనగర్-2	366
కోరుట్ల	125
మంథని	115
మెట్‌పల్లి	120
సిరిసిల్ల	112
వేములవాడ	176
రీజియన్	2069

పసిడి కాంతుల పర్వదినం

- నేడు అక్షయ తృతీయ
- రోహిణితో కూడిన బుధవారం కావడంతో విశిష్టత
- చుక్కలనంటుతున్న బంగారం ధర

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అక్షయ తృతీయ రోజున ఏది కొన్నా అక్షయంగా మారి, పుణ్య ఫలాల్ని ఇస్తుందని, చిన్న దానమైనా దారిద్ర్యం దరి చేరకుండా చేస్తోందని శాస్త్రాలు చెబుతున్నాయి. పరబ్రహ్మ వైశాఖ శుద్ధ తృతీయ రోజునే సృష్టికి శ్రీకారం చుట్టాడంటారు. ఈ రోజు గంగను స్మరిస్తూ లక్ష్మీదేవిని పూజించాలని భవిష్య పురాణం చెబుతోంది. అందుకే బంగారాన్ని లక్ష్మీదేవిగా పూజిస్తారు. పుణ్య క్షేత్ర సందర్శన, పుణ్యతీర్థస్నానాలకు ఫలం రెట్టింపుగా ఉంటుంది. అక్షయ తృతీయ నాడు దేవతలు భూలోకంలో జనుల యోగ క్షేమాలు పరీక్షించేందుకు వస్తారని ప్రతీతి.



అందుకే మనసును, ఇంటిని సంతోషంగా, ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఈ రోజు పిసరంతైనా బంగారం కొని వాడుకున్నా, దానం చేసినా ఎంతో ఫలితం వస్తుంది. ఈ క్రమంలో బుధవారం అక్షయ తృతీయను జరుపుకోనున్నారు. ఈ ఏడు రోహిణీ నక్షత్రంతో కూడిన బుధవారం రావడంతో మరింత విశిష్టత సంతరించుకుంది. ధర్మసింధువులోనూ ఈ విషయం పేర్కొన్నారు.

బంగారం, ఆభరణాల కొనుగోళ్ల సందడి

బంగారం, ఆభరణాల కొనుగోళ్ల సందడి సోమవారం నుంచే ప్రారంభమైంది. సెంటిమెంట్‌తో వినియోగదారులు బంగారం, వెండితో పాటు ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. ఆర్నమెంట్ వస్తువులకు గిరాకీ ఉన్నా బంగారం కొంటున్నారు. బహుమతుల కోసం రూ.1500 నుంచి ఆర్నమెంట్ వస్తువులు అందుబాటులో ఉండగా జువెల్లరి, స్వర్ణకారుల షాపులు సందడిగా మారాయి. పలు బంగారం షాపులు, స్టోర్లు ఆఫర్లు ప్రకటించాయి.



బంగారం కొనుగోలు చేస్తున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా రూ.2 కోట్ల వ్యాపారం అంచనా

బంగారం ధరలు చుక్కలనంటుతుండడం, ఎండలు తారెత్తిస్తుండడంతో ఈ ఏడు జిల్లా వ్యాప్తంగా రూ.2 కోట్ల వరకు వ్యాపారం జరగనుననట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం బంగారం తులానికి(12 గ్రాములు) రూ.1,15,120, పది గ్రాములకు రూ.98,700 పలికింది. వెండి తులానికి (12 గ్రాములు)రూ.1,172, పది గ్రాములకు రూ.1,005 ధర పలికింది. బంగారు ఆర్నమెంట్ రూ.91,790 ధర పలికింది. గత సంవత్సరానికి ఈసారికి గోల్డ్ ధర భారీగా పెరగడంతో పాత బంగారు, వెండి ఆభరణాలకు తగినట్లుగా కొత్తగా వస్తువులు, బంగారం, వెండి కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. బంగారాన్ని షాపుల్లో సావరిన్ గోల్డ్ బాండ్స్ రూపంలో కొనడం మేలని నిపుణులు చెబుతున్నారు. బంగారం, షాపుల్లో విక్రయించే ఆభరణాలు, వస్తువుల కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 2 గ్రాముల నుంచి నాణాల రూపంలో బంగారం అందుబాటులో ఉండగా కొని బహుమానాలు ఇచ్చే ఆనవాయితీ కూడా ఉంది. ఈ అక్షయ తృతీయ అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ఆనందాన్ని ప్రసాదించాలని కోరుకుందాం.



గుండారం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఎపిగ్రాఫికల్ సర్వే

సీతమ్మలొద్దిలో శిలపై చెక్కి ఉన్న శాసనాల పరిశీలన

పెద్దపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ శాఖ సహకారంతో జిల్లాలోని గుండారం రిజర్వ్ ఫారెస్టు లోపల మంగళవారం భారత పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ఎపిగ్రాఫికల్ సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా సీతమ్మలొద్దిలోని ఒక ప్రముఖ శిలపై చెక్కి ఉన్న శాసనాలను పరిశీలించారు. ఈ సర్వేను ఎపిగ్రఫీ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, భారత పురావస్తు సర్వే బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే బృందం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ ఈ యాత్రలో మొత్తం 11 పురాతన శాసనాలను ఎస్టాంపేజ్‌లో తీసుకున్నామన్నారు. క్రీస్తుపూర్వం 1వ శతాబ్దం నుంచి క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం వరకు ఉన్న ఈ శాసనాలు దక్కన్ ప్రాంతం యొక్క ప్రారంభ చరిత్ర, సాంస్కృతిక



గుండారం రిజర్వ్ ఫారెస్టులో ఎపిగ్రాఫికల్ సర్వే చేస్తున్న భారత పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా అధికారులు

పరిణామం గురించి చెబుతుందన్నారు. ఈ ప్రాంతాన్ని స్థానికంగా సీతమ్మలొద్ది అని పిలుస్తారని అన్నారు. ఇక్కడ ఒక ప్రముఖ శిలపై అన్ని శాసనాలు చెక్కబడి ఉన్నాయని, ఈ శాసనాలలో కొన్ని శాతవాహన కాలానికి చెందినవి ఉన్నాయన్నారు. ముఖ్యంగా శాతవాహన రాజవంశానికి చెందిన కుమార అకుసిరి యొక్క రెండు శాసనాలు ఈ ప్రదేశంలో మొదటిసారిగా గుర్తించబడ్డాయని పేర్కొన్నారు. ఇది భారతీయ శిలాశాసన రంగంలో అత్యంత ముఖ్యమైన ఆవిష్కరణను సూచిస్తుందన్నారు. అలాగే లిఖిత గ్రంథాలలో కొన్ని శాసనాలతో పాటు ఈ ప్రదేశం పాలియోలిథిక్ నుంచి చారిత్రక కాలాల వరకు ఈ ప్రాంతంలోని కొన్ని ముఖ్యమైన శిలాచిత్రాలకు నిలయంగా ఉందన్నారు. ఈ చిత్రాలు ఎరుపు, తెలుపు, పసుపు వర్ణద్రవ్యాలలో చిత్రీకరించబడ్డాయని, కాలక్రమేణా కళాత్మక వ్యక్తీకరణకు అమూల్యమైన ఆధారాలను అందిస్తాయన్నారు. గుండారం యొక్క సాంస్కృతిక, పురావస్తు ప్రొఫైల్‌ను సుసంపన్నం చేస్తాయన్నారు. ఈ ప్రాంతం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడంలో, ప్రోత్సహించడంలో నిరంతర మద్దతు ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ యాత్ర సర్వేలో భాగంగా ఫీల్డ్ వర్క్‌ను విస్తృతంగా డాక్యుమెంట్ చేసిన ప్రముఖ ఫొటో జర్నలిస్టు డి రవీందర్ రెడ్డి, రాక్ ఆర్ట్ పెయింటింగ్ స్పెషలిస్టు బీఎంరెడ్డి, అటవీ శాఖ రేంజర్ నాయక్ వారి వెంట ఉన్నారు.

ఎస్‌యూ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (హానర్స్) కోర్సులో రెండో సెమిస్టరు, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను మంగళవారం విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టరు సురేష్ కుమార్ విడుదల చేశారు. వచ్చే నెల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా 6-5-2025 వరకు, 300 రూపాయల అపరాధ రుసుముతో 9-5-2025 వరకు ఆయా కళాశాలల్లో ఆన్‌లైన్ పద్ధతిన చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

- సెప్టెంబరు 30 వరకు గడువు
- తరువాత తనిఖీల్లో పట్టుబడితే జరిమానా



తిమ్మాపూర్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను (హెచ్ఎస్ఆర్‌పి) తప్పనిసరిచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2019 ఏప్రిల్ 1 తరువాత తయారైన వాహనాలకు మాత్రమే ఈ నిబంధనలు అమలులో ఉన్నాయి. నూతన ఉత్తర్వుల ప్రకారం 2019 ఏప్రిల్ ముందు తయారైన వాహనాల తప్పని సరిచేస్తూ రాష్ట్ర రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను వాహనాలకు బిగించుకునేందుకు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకు గడువు ఇచ్చింది. నకిలీ నంబర్ ప్లేట్లను నిరోధించడం, వాహనాల దొంగతనాలను అరికట్టడం, రహదారి భద్రతను మెరుగు పరచడం వంటి లక్ష్యాలతో సుప్రీంకోర్టు ఆదేశాలతో రవాణాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌కు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, హోలో గ్రామ్ ఉంటుంది. వీటిని వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌తో అనుసం దనం చేస్తారు. ఈ నంబర్ ప్లేట్లను ట్యాంపర్ చేయడం, నకిలీవి సృష్టించడం సాధ్యం కాదు.

బిగించుకోకపోతే ఇబ్బందులే..

పాత వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత యజమానులదే. ఇకపై హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్‌ప్లేట్ లేని వాహనాలను అమ్మలన్నా, కొనాలన్నా సాధ్యం కాదు. వాహనాల రిజిస్ట్రేషన్ చేయరు. వాహనాలకు బీమా, పొల్యూషన్ సర్టిఫికేట్ కూడా జారీ చేయరు.

వాహనం	చెల్లించాల్సిన ఫీజు రూపాయల్లో
ద్విచక్ర వాహనం	320-380
ద్విచక్ర వాహనం (ఇంపోర్టెట్)	400-500
కార్లు	590-700
కార్లు(ఇంపోర్టెడ్)	700-860
త్రీ వీలర్	350-450
కమర్షియల్ వాహనాలు	600-800

ఎక్కడ బిగించుకోవాలి

వాహన తయారీ సంస్థల డీలర్ల వద్ద హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించుకోవాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన ధరలను కూడా నిర్ణయించడం జరిగింది. వాటి ప్రకారం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి నంబర్ ప్లేట్‌ను బిగించుకోవాలి. వాహనదారుడు తమ ఇంటి వద్దనే నంబర్ ప్లేట్‌ను బిగించుకోవాలంటే అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా వాహనాల వివరాలు

జిల్లా వ్యాప్తంగా 2019 మార్చి 31 నాటికి 5,44,824 వివిధ రకాల వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా ఏప్రిల్ 28-2025 నాటికి 6,55,223 వివిధ రకాల వాహనాలు రిజిస్ట్రేషన్ అయినాయి. వాహనదారులు వాహన రిజిస్ట్రేషన్ సమయంలో హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ కోసం రుసుము చెల్లించినా చాలా మంది బిగించుకోలేదు. ప్రస్తుతం ఖచ్చితంగా బిగించుకోవాలి. లేకపోతే రవాణాశాఖ సేవాలు నిలిచి పోవాడమే కాకుండా సెప్టెంబరు 30 తరువాత వాహనాల తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానతో కేసులు నమోదు చేయనున్నట్లు రవాణాశాఖ అధికారులు అంటున్నారు.

సెప్టెంబరు 30లోగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించుకోవాలి

పురుషోత్తం, డీటీసీ



సెప్టెంబరు 30లోగా ప్రతీ వాహనదారుడు తమ వాహనానికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ బిగించుకోవాలి. లేకపోతే రవాణా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేని వాహనాలకు భారీ జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తాం. వాహనాలను సీజ్ చేస్తాం. వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకపోతే రవాణా శాఖకు సంబంధించిన ఎటువంటి సేవలు వర్తించవు.



తిమ్మాపూర్‌లోని రవాణాశాఖ కార్యాలయం

ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం ఎలా

వాహనదారులు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ కోసం సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ www.sism.in, bookmyhsrp.com వెబ్‌సైట్లలో వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి. నంబర్ ప్లేట్‌ను ఇన్‌స్టాల్ చేయాలనుకుంటున్న సమీప డీలర్‌ను ఎంచుకోవాలి. అనంతరం ఇన్‌స్టాలేషన్‌కు అపాయింట్‌మెంట్ బుక్ చేయడానికి ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించాలి. అపాయింట్‌మెంట్ తేదీన సంబంధిత డీలర్ వద్దకు వెళ్లి ఒరిజినల్ పత్రాలు, ఫీజ్ చెల్లించిన రసీదును చూపిస్తే వారు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగిస్తారు.

ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికుల మెరుపు సమ్మె

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెరుపు సమ్మెకు దిగారు. ఫ్యాక్టరీ గేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ సంఘం యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేష్ మాట్లాడుతూ ఆర్ఎఫ్‌సీ ఎల్ యాజమాన్యం చర్చలకు రాకుండా కాలయాపన చేస్తుందని, రెండు నెలల కింద సమ్మె నోటీసు ఇచ్చినా స్పందించకుండా మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌కు రూ.510కోట్ల లాభాలు వస్తే కార్మికులకు వాటా ఇవ్వకుండా తప్పించుకుంటుందని, కార్మికులకు కనీస పనికి కనీస వేతనం చెల్లించడం లేదని, ఇన్సెంటివ్‌లు, బోనస్‌లు ఇవ్వడం లేదని, పనిస్థలాల్లో కనీస వసతులు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీపీసీ ఎస్ఐ మానస సమ్మె విరమించాలని కార్మిక సంఘాల నాయకులను కోరగా తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఆందోళన చేస్తున్న కార్మికులతో అధికారులు మే 3న చర్చిస్తామని హామీ ఇవ్వడంలో కార్మికులు సమ్మెను విరమించారు. ఈ కార్యక్రమంలో కొమురయ్య, రాంకీ, అఫ్జల్, దేవయ్య, నయీం, నరేష్, రవి, శ్రీనివాస్, మహేందర్, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. దాదాపుగ ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్,అధికారులు పర్యవేక్షించారు.



ఆలయ ఆవరణలో భక్తులు

సైబర్ నేరాల ఛేదనకు శిక్షణా తరగతులు దోహదం..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల ఛేదనకు శిక్షణా తరగతులు దోహదపడుతాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే అన్నారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాల పరిశోధనలో అవసరమైన అంశాలపై కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట జిల్లాలకు చెందిన అధికారులకు, సిబ్బందికి రెండు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేలా ప్రణాళిక రూపొందించవచ్చన్నారు. సైబర్ నిందితులకు శిక్ష పడటంలో డిజిటల్ సాక్ష్యాధారాల సేకరణ కీలకమన్నారు. సాంకేతికత ఆధారంగా అధికారులు, సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు.



మాట్లాడుతున్న రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బి.గీతే

పోలీసు అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు సమాజంలో జరిగే మోసాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సైబర్ మోసాలకు, సోషల్ మీడియాప్లాట్ ఫామ్‌ను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడే నేరస్థులకు శిక్షపడటంలో సాక్ష్యాధారాలు ప్రధాన పాత్రను పోషిస్తాయన్నారు. సైబర్ నేరం జరిగినపుడు ఫిర్యాదు నమోదు నుంచి డిజిటల్ ఆధారాల సేకరణ, విశ్లేషణ, తదితర అంశాలపై తెలుసుకోవాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేసే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయా పోలీస్‌స్టేషన్లలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.పిల్లల ఆన్‌లైన్ భద్రతపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, కోర్సు సమన్వయకర్త డీఎస్పీ రాజ్‌కుమార్, భీం కృష్ణనాయక్, సైబర్ ఎక్స్‌పర్ట్ అఖిలేష్‌రావు, పోలీసు అధికారులు, పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఎప్‌సెట్

తిమ్మాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అత్యంత కీలకమైన ఈఏపీసెట్ (ఎప్‌సెట్)-2025 పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 29,30 తేదీల్లో మంగళవారం, బుధవారం అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు జరగనుండగా, మే 2నుంచి 4వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరగనున్నాయి. దీనికిగాను కరీంనగర్ జోన్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, సిద్దిపేటలో మొత్తం కలిపి 12 పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, శ్రీచైతన్య కాలేజీఆఫ్ టెక్నలజికల్ సైన్సెస్, కరీంనగర్‌లోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్, హుజూరాబాద్‌లోని కమల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, పెద్దపల్లి జిల్లాలోని ట్రినిటి, మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో, మంథనిలోని జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జగిత్యాల జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సిద్దిపేట జిల్లాలో ఇందుర్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మరోపరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



తిమ్మాపూర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో క్యూలో విద్యార్థులు



విద్యార్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

రెండు సెషన్‌లలో పరీక్ష..

మంగళవారం జరిగిన ఈఏపీసెట్ (ఎప్‌సెట్)-2025 పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటిసెషన్‌లో 12 కేంద్రాల్లో కలిపి 2,860 మంది విద్యార్థులకుగాను 2,704మంది విద్యార్థులు పరీక్షకు (94.5%) హాజర య్యారు. 156మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 2,860మంది విద్యా ర్థులకుగాను 2,694మంది (94.2%) పరీక్షకు హాజరుకాగా 166మంది గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. ఉద యం 7.30నుంచి, మధ్యాహ్నం 1.30నుంచి విద్యార్థు లను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. నిమిషం నిబంధన కారణంతో కొంతమంది విద్యార్థులు పరీక్ష సమయానికి రాకపోవడంతో రాయకుండనే వెనుతిరిగారు.

ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి

ఎలిగేడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని బౌద్ధక్షేత్రం పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎరువుల సాగర్ డిమాండ్ చేశారు. మగళవారం మండలంలోని ధూళికట్ట గ్రామంలో ఉన్న అతి ప్రాచీన ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ధూళికట్ట బౌద్ధ క్షేత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్షానికి గురై కనీసం సరైన రోడ్డు సౌకర్యం, తాగునీటి వసతి, భద్రత లేకుండా పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తెలంగాణలో అతి ప్రాచీనమైన చరిత్ర కలిగిన ధూళికట్ట బౌద్ధ క్షేత్రం నేడు అంధకారంలో మగ్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ధూళికట్ట బౌద్ధ క్షేత్రం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. మే 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా వేలాది మంది బుద్దిస్టులు, పర్యాటకులు ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని దర్శించుకుంటారని తక్షణమే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే చింత కుంట విజయరమణరావు, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ధూళికట్ట బౌద్ధక్షేత్రం పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఇరుగురాల సాగర్, కలవల అనిల్, ఇరుగురాల శ్రీకాంత్, సుంకనపల్లి కార్తీక్, ఇరుగురాల వంశీ, గణేష్, సాయి పాల్గొన్నారు.



బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన పరిరక్షణ కమిటీ సభ్యులు

ప్రజాపాలన అందించడమే లక్ష్యం



పాలకుర్తిలో మాట్లాడుతున్న మనాలి ఠాకూర్

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రజాపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని పాలకుర్తి, బసంత్‌నగర్‌లో ఆమె ఉపాధిహామీ పనుల స్థలాలను పరిశీలించి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా దంచి కొడుతున్నాయని, కూలీలకు పని స్థలాల్లో చల్లని తాగునీరు , నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిని మెరుగు పరచడం, గ్రామ అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ముందుకు సాగుతున్నాడన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, కన్నాల ప్యాక్ చెర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, బసంత్‌నగర్ మాజీ సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపిటీసి పాత భాగ్యలక్ష్మి రవీందర్, నాయకులు మేర్గు అశోక్,బోదాసు శంకర్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఎప్‌సెట్ పరీక్షలు

రామగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎప్‌సెట్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజున అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలో 100 మందికి 95 మంది హాజరు కాగా.. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 92 మంది హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ తెలిపారు. పరీక్ష జరుగుతున్న తీరును ప్రొఫెసర్ చెరుకు శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కమ్యూనిటీ వర్క్‌షాప్

రామగిరి: పెద్దపల్లి ప్రాంతంలో బొగ్గురంగంలో కార్మికులు కష్టపడి చేసిన శ్రమతో ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరింది. ప్రపంచం క్లీన్ ఎనర్జీ, నూతన పరిశ్రమల వైపు మారుతున్న సందర్భంలో బొగ్గుపై ఆధారపడిన కుటుంబాలు వెనుక పడిపోకుండా ఉండేందుకు మంగళవారం జేఎన్టీయూ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఢిల్లీకి చెందిన ప్రజా విధాన సంస్థ స్వనితి ఇనిషియేటివ్, కామన్స్ కలెక్టివ్ లు సంయుక్తంగా వర్క్‌షాప్‌ను నిర్వహించారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లో 27మంది టూరిస్టులపై ఉగ్రవాదాలు దాడి చేసి చంపడం హేయమైన చర్య అని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు పీటి స్వామి అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్‌లో ఉగ్రవాదులు అశాంతిని నెలకొల్పారని, పాకిస్తాన్ ఉగ్రవాదులకు మద్దతు పలకడం పిరికిపందల చర్య అని అన్నారు. సమావేశంలో గంట సత్తయ్య, లింగమూర్తి, లక్ష్మీరాజం, రాఘోత్తంరెడ్డి, ప్రకాష్, నాగ రాజు, సత్యనారాయణ, వేపూరి రాములు, బట్టల సత్తయ్య పాల్గొన్నారు.

పల్నాడులో అవార్డు అందుకున్న ఎంఈవో

ఎలిగేడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా నర్సరావుపేటలో జరిగిన జాతీయస్థాయి పల్నాడు మ్యాజిక్ ఫెస్టివల్‌లో మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈవో అనసూరి నరేంద్రచారికి బెస్ట్ లెక్చర్ కం డెమోనోస్ట్రేటర్ అవార్డు అందుకున్నారు. ఈవిభాగంలో మొత్తం నలుగురికి లెక్చర్ కం డెమోనోస్ట్రేటర్ చేసే అవకాశం దక్కింది.

ఉచిత వైద్య శిబిరం

ముత్తారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ అసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ముత్తారం మండలం ఓడేడ్ గ్రామంలో గౌడ సంఘం వారికి ఉచితంగా వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 120 మందికి డాక్టర్ దీక్షిత్ పరీక్షలు చేశారు. మెడికవర్ అసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, దాసరి చంద్రమౌళి గౌడ్, అల్లాడి యాదగిరి రావు, చేరాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు



ముత్తారంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విధులకు ఆటంకం కలిగించి కారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐక్య కార్యాచరణ సమితి, జిల్లా టి ఎన్ జి ఓ అధ్యక్షులు బొంకూరి శంకర్ ఆద్వర్యలో మంగళవారం జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 26న జిల్లా వైద్యాధికారి డా. జి. అన్న ప్రసన్న కుమారి విధి నిర్వహణలో భాగంగా గోదావరిఖని మమత హాస్పిటల్ తనిఖీ చేశారు. అందులో అనుమతిలేని అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను గుర్తించి. చట్ట ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ కలిగి ఉండడం నేరమని, చర్యలు చేపడుతుండగా అడ్డుపడ్డారని కలెక్టరుకు వివరించారు. వారిపై చట్ట రీత్యా తగు చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి యాజమాని ప్రభుత్వ డాక్టర్ నాగిరెడ్డి, అందులో భాగసౌమ్యులై కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ప్రభుత్వ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ ఆర్.జె. స్వాతిలను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ బి.శ్రీరాములు, డాక్టర్ బి.కిరణ్ కుమార్, టి ఎన్ జి ఓ హెల్త్ ఫోరం అధ్యక్షులు వీరగోని శ్రీనివాస్, టిజిఓ హెల్త్ ఫోరం అధ్యక్షులు ఉమామహేశ్వర్, రాష్ట్ర పారా మెడికల్ అధికారుల ఫోరం అధ్యక్షులు దేవిసింగ్, ఆర్ బి ఎస్ కె డాక్టర్లు కె రమేష్, టి. రాజేష్, సాలమ్మ, దయామని, ఎన్ హెచ్ ఎమ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తారం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి మీద జరిగిన దాడిని ముత్తారం ప్రభుత్వ డాక్టర్ అమరేందర్ రావు ఖండించారు. ఈ మేరకు డాక్టర్, సిబ్బంది తమ నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రైవేట్ అసుపత్రులలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్స్ పర్మిషన్స్ తీసుకుని నిర్వహించాలని ఆదేశించిన డీఎంహెచ్ఓను ఆగౌరపరుస్తూ ప్రైవేట్ అస్పత్రుల సిబ్బంది చేసిన తప్పుడు అబద్ధపు ఆరోపణలు ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు.

కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలో ఓ ప్రైవేట్ అసుపత్రిలో తనిఖీకి వచ్చిన డీఎంహెచ్ఓపై వైద్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు దౌర్జన్యానికి దిగడం సరైంది కాదని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జూపాక వెంకటి, ప్రధాన కార్యదర్శి పెరుక మనోహర్ అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఓ ప్రైవేట్ అసుపత్రిలో ఎలాంటి అనుమతి లేకుండా స్కానింగ్ నిర్వహిస్తూ లింగ నిర్ధారణ చేస్తున్నారని డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేయడానికి వెళ్లారన్నారు. అధికారులకు అండగా నిలువాల్సిన ప్రజా ప్రతినిధులే బెదిరింపులకు పాల్పడడం సరైంది కాదన్నారు. సమావేశంలో మాదిగ లాయర్ల సంఘం నాయకులు పులిపాక ప్రవీణ్, ఇరుగురాళ్ల సంతోష్, పులిపాక రాజ్‌కుమార్, కాదాసి శేఖర్ ఉన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాలనీలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్‌కుమార్ మాట్లాడారు. దేశంలోని కార్మికవర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 49 కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా సవరించే కుట్రను తిప్పి కొట్టాలని కోరారు. డిప్యూటీ జనరల్ సెక్రె టరీ వైవీరావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజారత్నం, ఆర్జీ-2 సెక్రెటరీ జిగురు రవీందర్, రవికుమార్ ఉన్నారు.

కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్ : తిప్పారపు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, అయినా కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ విషం చిమ్ముతోందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్ ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదేళ్లలో రూ.7లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి మిగులుగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌పార్టీదని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మక రాజేష్, చుక్కల శ్రీనివాస్, నాయిని ఓదెలు, కొమ్ము వేణు, దొంత శ్రీనివాస్, నాజీమోద్దీన్, తొటం సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిన్నచూపు

ముత్తారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అన్నారు. కేసనేపల్లి గ్రామంలో జరుగుతున్న పనులను మంగళవారం సందర్శించి పరిశీలించామన్నారు. నేల గట్టిగా ఉండటంతో తవ్వకాలు కూలీలకు గిట్టుబాటు కావడంలేదన్నారు. అధికారులు పనులు చూపకపోవడంతో కూలీల సంఖ్య తగ్గిపోయిందన్నారు. కూలీలకు రవాణా చార్జీలు ఇవ్వడం లేదన్నారు. పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఊట్ల శంకరయ్య, కోళ్ల శ్రీనివాస్, తోట సత్తయ్య కుమారస్వామి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా పోచమ్మ ఆలయం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే గోదావరిఖని పోచమ్మ ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంగా ఉన్నది. ఆరు దశాబ్ధాల క్రితం గోదావరిఖని చౌరస్తా నడిబొడ్డున వెలిసిన ఆలయం అప్పుడు ఎలా ఉందో ఇప్పుడూ అలానే ఉంది. గోదావరిఖనికి గుండెకాయలాంటి ఈ పోచమ్మ ఆలయం భక్తులకు కొంగుబంగారం. నిత్యం శుభ కార్యాలయాలైనా, ప్రయాణాలైనా, వ్యాపార అభివృద్ధికి అయినా ఇక్కడికి వచ్చి ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ పోచమ్మ విగ్రహాన్ని గడ్డం బాణయ్య, కంది పోషం, లింగయ్య ఈ నెలకొల్పడానికి కృషి చేశారు.పారిశ్రామిక ప్రాంతంలో భక్తులందరూ ఇక్కడికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి ఏటా ఉగాది ముందు పెద్ద ఎత్తున బోనాలను సమర్పిస్తుంటారు. ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు దేవాదాయశాఖ కానీ, ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోలేదు. 60ఏళ్ల క్రితం వెలిసిన ఈ ఆలయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆలయ స్థలాన్ని కూడా కొంత మంది కబ్జాదారులు కబ్జా చేశారు.

ఎండోమెంట్ పరిధిలోకి తీసుకురావాలి
ముష్కె సంపత్, బజరంగ్‌దళ్ నాయకుడు



ప్రతి ఏటా ఉగాది సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పోచమ్మకు బోనాలు సమర్పిస్తారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. ఎండోమెంట్ పరిధిలోకి తీసుకువచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. ఆలయ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ముందుకు రావాలి.



చౌరస్తాలోని పోచమ్మ ఆలయం

మా నిధులు మాకే

(5వ పేజీ తరువాయి)

ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం వద్ద చేతులు చాపాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాలో అతి పెద్ద వనరుగా భావిస్తున్న సింగరేణి సంస్థ నుంచి గత ఐదేళ్లుగా డీఎంఎఫ్‌టీకి నేరుగా డబ్బులు జమకావడం లేదని అధికారులు చెబుతున్నారు. సింగరేణితో పాటు ఆయా సంస్థలు జమచేస్తున్న నిధులను జిల్లాకు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వమే వివిధ అవసరాలకు వాడుకుంటున్నట్లు తెలుస్తున్నది. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా 50 కోట్ల రూపాయలు కేటాయించారు. మంథని నియోజకవర్గంలో కొన్ని నిధులను రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. గతంలో డీఎంఎఫ్‌టీ కింద చేసిన పనులకు సంబంధించి చాలా వరకు బిల్లులు పెండింగులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో గల ఖనిజ, ఇసుక, ఇతర వనరుల ద్వారా ప్రతి ఏటా 130 నుంచి 150 కోట్ల రూపాయలకు పైగా జమ అవుతాయని, జిల్లా అభివృద్ధి కోసం ఎవరి వద్ద చేయి చాపకుండా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యేలు ఆశిస్తే వారి ఆశలు అడియాసలే అవుతున్నాయి. జిల్లాలో నెలకొన్న పరిస్థితుల గురించి ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. నేరుగా ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికైనా జిల్లాకు డీఎంఎఫ్‌టీ నిధులను కేటాయిస్తారా, లేదా వేచి చూడాల్సిందే.

శిశువు మృతిపై బంధువుల ఆందోళన

కోల్‌సిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో ప్రసూతి సమయంలో శిశువు మృతి చెందింది. స్థానిక గాంధీనగర్‌కు చెందిన సాలెహ బేగంకు వైద్యులు సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో శిశువు మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆరోపించారు. నష్టపరిహారం చెల్లించడంతో వివాదం సద్దుమణిగినట్లు సమాచారం.

మేడే కరపత్రాల పంపిణీ

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):రామగుండంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో ఆర్‌టీసీహెచ్ డిపో వద్ద మేడే కరపత్రాలను సీపీఎం నాయకుడు ఎం రామాచారి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్మికులు బొంకూరి మహేష్, లక్ష్మణ్, శివ, బాలాజీ, సతీష్, అమృత పాల్గొన్నారు.

కరాటే గ్రేడింగ్ టెస్టు బెల్టుల ప్రదానం

మంథని, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): షోటోకాన్ కరాటే విద్యార్థులకు కోచ్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌బీ గార్డెన్స్‌లో గ్రేడింగ్ టెస్టును మంగళవారం నిర్వహించారు. ఇందులో ప్రతిభను చాటిన వారికి 12 జూనియర్ రెడ్, 10 ఎల్లో, 7 అరెంజ్, 6 గ్రీన్, 2 బ్లూ, 2 పర్పుల్, 4 బ్రౌన్ బెల్టులు ప్రదానం చేశారు. మహిళలు కరాటే నేర్చుకోవాలని షోటోకాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య సూచించారు. బెల్టులు సాధించిన విద్యార్థులను జేకేఏ ఇండియా సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్ ప్రత్యేకంగా అభినందిచారు.



కనీస వేతన సలహా మండలి తీర్మానాలను అమలు చేయాలని వినతి



కూనంనేనికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనాల ప్రతిపాదనలను తక్షణమే గెజిట్ చేసి అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ముగ్దుం భవన్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కనీస వేతనాల సలహా మండలి సభ్యులు ఎండీ యూసుఫ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీలు మాట్లాడుతూ గత 10సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలు పెరగక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు పెంచడానికి కనీస వేతనాల సలహా మండలి ఏర్పాటు చేసి అనేక దఫాలుగా సమావేశాలు నిర్వహించారని చివరగా సోమవారం రోజున జరిగిన కనీస వేతనాల సలహా మండలిలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. కార్మికుల పర్వదినమైన మే 1వ తేదీన ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గెజిట్ చేసి అమలు పరుచుటకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు అఫ్రోజ్ ఖాన్, యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కె డబ్ల్యూ క్రిస్టోఫర్, కార్యవర్గ సభ్యులు దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

● ఏఐటీయూసీలో చేరిన మహిళా ఉద్యోగులు



యూనియన్‌లో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న మడ్డి ఎల్లయ్య

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను మినహాయింపు, సొంత ఇంటి పథకం అమలు, మారుపేర్లు విజిలెన్స్ బాధితుల సమస్యను పరిష్కరించడానికి యాజమాన్యం గుర్తింపు సంఘంతో జరిగిన సమావేశాల్లో అంగీకరించిన విధంగా తొందరగా పరిష్కారం చేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్‌జీ-1 వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అన్నారు. గురువారం జీడీకే 11ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. యాజమాన్యం అంగీకరించిన సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను సింగరేణిలో ఘనంగా జరుపుకోవాలని, ఆర్‌జీ-1లో జరిగే మేడే ర్యాలీలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వా నించారు. ఏఐటీయూసీ పిట్ అసిస్టెంట్ సెక్రటరీ గొడిశెల నరేష్ ఉన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

● డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు



మాట్లాడుతున్న సింగరేణి ఆర్‌జీ-1 డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సంపాదించాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సింగరేణి ఆర్‌జీ-1 డీజీఎం పర్సనల్, సింగరేణి హైస్కూల్ సెక్టార్-2 కరస్పాండెంట్ డి.కిరణ్‌బాబు అన్నారు. గోదావరిఖనిలోని సింగరేణి హైస్కూల్ సెక్టార్-2 పాఠశాలలో మంగళవారం స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఆంగ్లభాషలో మరింత పట్టు సాధించాలని, ధారాళంగా ఇంగ్లీష్ మాట్లాడాలనే ఉద్ధేశ్యంతో సంస్థ ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను నిర్వహిస్తుందన్నారు. 45రోజుల పాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విద్యాసంవత్సరానికి ఒకటవ తరగతి అడ్మిషన్‌లు జరుగుతున్నాయని, ఇతర తరగతుల్లో పరిమిత సంఖ్యలో అడ్మిషన్‌లు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఉపాధ్యాయులు రేష్మ, కళ్యాణి, స్వప్నరాణి, నాగరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నదని, కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. కోల్ ఇండియా లో హైపవర్ కమిటీ సిఫార్సు చేసిన వేతనాలు అమలు అవుతున్నా సింగరేణిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో న్యాయం చేస్తామని, వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీలను ప్రజాప్రతినిధులు గెలిచిన తర్వాత విస్మరిస్తున్నట్టు జేఏసీ నాయకులు పేర్కొన్నారు. మేడే సందర్భంగానైనా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, ఇతర సదుపాయాలు కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈధర్నాలో ఇఫ్టూ, హెచ్‌ఎంఎస్, నాయకులు బీ అశోక్, దావు రమేష్, అయాజుద్దీన్, కే శ్రీనివాస్, బుచ్చమ్మ, పద్మ, రాజనర్సు, శారద, గట్టయ్య, శంకరప్ప, జలపతినాయక్ పాటు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందనున్న సేఫ్టీ జీఎంకు సత్కారం

రామగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తాను మంగళవారం సత్కారించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ-3,ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు, అధికారులు గుప్తాను శాలువ, పూలదండలతో ఆత్మీయంగా సత్కారించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదికారులు శేఖర్‌బాబు సత్యనారయణ, శ్రీనివాసులు, సిహెచ్ వెంకటరమణ, రాజశేఖర్, ప్రవీణ్, ఫాంటింగ్, రామ్మోహన్, చంద్రశేఖర్, రాజారెడ్డి, జనార్థన్‌రెడ్డి, రాజేంద్రకుమార్, సుదర్శనం, కాశీ విశ్వేశ్వర్‌రావు, షబ్బీరోద్దిన్ ఐలయ్య రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్‌పై కార్మికులకు అవగాహన

గోదావరిఖని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్ ఉద్యోగులకు మంగళవారం ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్‌పై అధికారులు అవగాహన కల్పించారు. బేస్‌వర్క్‌షాప్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రెస్క్యూ బృందం సభ్యులు సీపీఆర్ చేసే విధానం, ఫస్ట్ ఎయిడ్‌లపై డెమో నిర్వహించారు. మెయింటనెన్స్ సెక్షన్‌లో భారీ వాహనాలపై పని చేసే సమయాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఏవిధంగా స్పందించాలని, ప్రమాదం నుండి బయట పడేలా పరికరాలను ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్జీ-3 సేఫ్టీ ఆఫీసర్ రామ్మోహన్, ప్రాజెక్టు సేఫ్టీ ఆఫీసర్ కోటయ్య, ప్రాజెక్టు ఇంజనీర్ ఉదయ్‌భాస్కర్, బేస్‌వర్క్‌షాప్ హెచ్‌ఓడీ సత్యనారాయణతో పాటు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు రమేష్, జక్కుల దామోదర్‌రావు సూపర్‌వైజర్లు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్జీ-3 ఏరియా స్థాయి స్ట్రక్చర్ సమావేశం

రామగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధి జీఎం కార్యాలయంలో ఆర్జీ-3,ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు అధ్యక్షతన సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ప్రతినిధులతో మంగళవారం ప్రాజెక్టు ఏరియా స్థాయి స్ట్రక్చర్ సమావేశాన్ని నిర్వహించారు. ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఓసిపి-1 సిహెచ్‌పి వే బ్రిడ్జి నుండి డిజియం కార్యాలయం వరకు వెళ్లే దారి వరకు ప్రహరీ గోడ నిర్మాణం, వివిధ ప్రాంతాలకు వెళ్లే మహిళా ఉద్యోగులకు యాక్టింగ్ మస్టర్లు కల్పించడం, డంపర్‌ల క్యాబిన్‌లలో ఏసిల బిగింపు, క్వార్టర్స్ సమస్యలపై చర్చించారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

రామగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, చట్టబద్ద హక్కులతో పాటు మరో 14 డిమాండ్‌ల పై మంగళవారం హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయు, టీఎన్‌టియుసీ, టియూసిఐ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పర్సనల్‌మేనేజర్ సుదర్శనంకు పలు డిమాండ్ పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆకుల వెంకన్న, కొమ్ముమధునయ్య, సంగెం రాజు, రమేశ్, లింగయ్య రాజనర్సు, నర్సయ్య, ఓదెలు, కనకలక్ష్మి, రేణుక, పద్మ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రధాన కార్యదర్శికి అభినందన

గోదావరిఖని, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కే రామకృష్ణా రావును మంగళవారం తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, సభ్యులు నరసింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రామకృష్ణారావును సన్మానిస్తున్న జనక్‌ప్రసాద్